హైదరాబాద్ వార్త





# ఈద్ ముబారక్

## సామూహిక ప్రార్థనలతో కిక్కిరిసిన ఈద్గాలు, మసీదులు







హైదరాబాద్, మార్చి 21 ప్రభాతవార్త ; ప్రేమ పూర్వక ఆలింగనాలు..పరస్పర శుభాకాంక్షలు..సామూహిక ప్రార్థనలు..ప్రత్యేక వంటకాల ఘుమఘుమలు..షీర్ కుర్మా తియ్యదనం మధ్య మహానగరం పరిధిలో శనివారం ముస్లీంలు ఈద్-ఉల్-ఫీతర్ (రంజాన్) పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదులు కిక్కిరిసిపోయాయి. సామూహిక ప్రార్థనల అనంతరం బంధు మిత్రులు ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పు కుంటూ..షీర్ కుర్మాతో నోరు తీపి చేసుకున్నారు.మీరాలం ఈద్గా, మక్కా మసీదు, చార్మినార్ తదితర ప్రాంతాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రాజకీయ నాయ కులు, అధికారులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అమ్మో..స'మోసాలు'!

- కుళ్లిపోయిన గుడ్లు, నల్లగా కందెలా మారిన నూనె..
- ఈ సమోసాలు తింటే ఇంకేమైనా ఉందా..!
- జియాగూడలో అక్రమ సమోసా తయారీ కేంద్రంపై దాడీ
- 5లక్షల విలువైన అపరిశుభ్ర ఆహార నిల్వలు సీజ్..
- నిందితుడి అరెస్ట్







హైదరాబాద్, మార్చి 21 ప్రభాతవార్త

హైదరాబాదీలకు స్నాక్స్ అంటే టక్కున గుర్తొచ్చేవి సమోసాలు, తక్కువ ధరలో ఆకలి తీర్చుకునేందుకు, రుచికరంగా, ఈజీగా క్యారీ చేసేందుకు వీలుగా ఉండే సమోసాలంటే ఎంత క్రేజో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సీటీలో అత్యధికంగా అమ్ముడుపోయే సమోసాల తయారీ గురించి తెలిసేనత మాత్రం తినాలా వద్దా అని ఒకసారి ఆలోచిస్తారు. కొందరు వ్యాపారులు కాసులకు కక్కుర్తి పడి జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మనుషుల ఆరోగ్యాలను ఏం చేయాలనుకున్నారో కానీ..ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో దారుణ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

హైదరాబాద్ సిటీ పోలీస్ టాస్క్ ఫోర్స్‌కు చెందిన హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్, కుల్సుంపురా పోలీసుల సమన్వయంతో జిగూడలోని ఒక అక్రమ ఆహార తయారీ కేంద్రంపై మెరుపు దాడి చేసి, దానిని సీజ్ చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు, శుక్రకవారం సాయం త్రం సుమారు 6 గంటలకు, టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ నేతృత్వంలోని బృందం, కుల్సుంపురా స్థానిక పోలీసులు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కలిసి జియాగూడలోని ఎస్.బి.ఏ గార్డెన్ ఎదురుగా ఉన్న ఇంటి ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సదరు తయారీ కేంద్రం ఎటువంటి లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ లేదా ఫైర్ సేఫ్టీ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడు అబ్దుల్ రషీద్ (73) అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో, కుళ్ళిపోయిన గుడ్లు మరియు పదేపదే మరిగించిన నూనెను ఉపయోగిస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా సమోసాలను తయారు చేస్తున్నట్లు తేలింది. సీజ్ చేసిన వస్తువుల వివరాలు కోడిగుడ్లు, వంట నూనె,ఎగ్ సమోసాలు,స్వీట్ కార్న్ సమోసాలు,ఉల్లిపాయ సమోసాలు ,మైదా,ఉప్పు,సమోసా పట్టీలు, అపరిశుభ్రమైన స్వీట్ కార్న్, ఫ్రైయర్, ఉల్లిపాయలు కోసే యంత్రం మరియు వంట పాత్రలు. అన్ని వస్తువులను సీజ్ చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కుల్సుంపురా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**ప్రజలకు సూచన:** ఆహార కల్తీ మరియు అక్రమ తయారీ కేంద్రాలపై హైదరాబాద్ సిటీ పోలీస్ నిరంతరం నిఘా ఉంచుతుంది. ప్రజలు తమ ప్రాంతాల్లో ఇటువంటి అక్రమ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి, ప్రజారోగ్య రక్షణలో భాగస్వాములు కావాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ టాస్క్ ఫోర్స్ అధికారులు పేర్కొన్నారు.

### సీజ్ చేసిన వస్తువుల వివరాలు...

- పాడైపోయిన కోడిగుడ్లు :500
- వాడేసిన వంట నూనె 5 కిలోలు
- మైదా :50 కేజీలు
- ఉప్పు:4 బస్తాలు

### తయారు చేసిన పదార్థాలు..

- ఎగ్ సమోసాలు :350
- స్వీట్ కార్న్ సమోసాలు :600
- ఉల్లిపాయ సమోసాలు :1000

# ఖాజాగూడ హెరిటేజ్ రాక్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..

**- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన**



హెరిటేజ్ రాక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ జి.సృజన తదితరులు

సైబరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త: ఖాజాగూడ హెరిటేజ్ రాక్ అభివృద్ధిపై సీఎంసీ కమిషనర్ సృజన ప్రత్యేక దృష్టి సారించారు. ఈక్రమంలో సీఎంసీ కమిషనర్ సృజన ఖాజాగూడ హెరిటేజ్ రాక్‌ను శేరిలింగంపల్లి జోన్ కమిషనర్, ఏసీ యూబీడీ, నార్సింగి, శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ల తో కలిసి శనివారం సందర్శించారు. సేవ్ ది రాక్స్ సంస్థ సభ్యులు సంగీత, రుత్విక్ రాళ్ల చారిత్రక ప్రాధాన్యతను కమిషనర్‌కు వివరిస్తూ, ప్రత్యేక రాక్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాళ్ల నిర్మాణాల ప్రత్యేకతలు, సందర్శన స్థలాలను కమిషనర్‌కు సభ్యులు వివరించారు.రాళ్ల పరిరక్షణతో పాటు ఖాజాగూడ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు. హెచ్ఎండీఏ, హైడ్రా, సీఎంసీ సంస్థల సమన్వయంతో పచ్చదనంతో కూడిన రాక్ గార్డెన్ రూపకల్పన చేయాలని సూచించారు. ఖాజాగూడ సరస్సుతో అనుసంధానం చేయడం, రాళ్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదేవిధంగా భౌగోళిక, భూ వివరాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన అనుమతుల కోసం రెవెన్యూ శాఖ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.ఈ ప్రాంతాన్ని నగరానికి ఊపిరితిత్తులుగా, ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశం ఉందని, ఆదిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ సూచించారు.

# వాట్సాప్ డిపి..తస్మాత్ జాగ్రత్త

- రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు
- డిపి ఫోటోలు తీసుకుని మార్ఫింగ్
- నగ్నంగా మార్చి కుటుంబసభ్యులకు పంపుతున్నవైనం
- డబ్బులు ఇవ్వకుంటే సోషల్ మీడియాలో పెడతామని బెదిరింపులు




హైదరాబాద్, మార్చి 21,ప్రభాతవార్త:

వాట్సాప్ డిపిలు పెడుతున్నారా ..అయితే జాగ్రత్తగా ఉండాల్సిదే..ఇదే అదునుగా భావిస్తున్న సైబర్ కేటుగాళ్లు ..,చిత్రాలను మార్ఫింగ్ చేస్తున్నారు. ఆపై వారిని బెదిరించి లొంగదీసుకోవడం లేదా లక్షల్లో డిమాండ్ చేయడం చేస్తున్నారు. ఇటీవల నగరానికి చెందిన ఓవ్యక్తి తన భార్యతో దిగిన చిత్రాన్ని వాట్సాప్ డిపిగా పెట్టుకున్నాడు. సైబర్ మోసగాళ్లు ఆచిత్రాన్ని స్క్రీన్‌షాట్ తీసుకని అందులో భార్య చిత్రాన్ని మరో వ్యక్తితో ఉన్నట్లు మార్ఫింగ్ చేసి భర్తకు పంపించారు. ఈచిత్రాలు వైరల్ కాకుండా ఉండాలంటే డబ్బులు పంపించాలని డిమాండ్ చేశారు. కుటుంబ పరువు పోతుందని భయపడిన బాధితులు రూ.1.50లక్షలు ఆమోసగాళ్లకు బదిలీ చేశారు. అంతటితో ఆగకుండా మరిన్ని డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. అలాగే మరో వివాహితుడి వాట్సాప్‌కి కాల్ గర్ల్స్ కావాలా..? అనే పేరుతో లింక్ వచ్చింది. దానిపై క్లిక్ చేయగానే అతడి ఫోన్‌నంబర్ ఓవాట్సాప్ గ్రూప్‌తో అనుసంధానం అయ్యింది. కొద్దిక్షణాల్లోనే నగ్నంగా ,అర్థనగ్నంగా ఉన్న అమ్మాయిల చిత్రాలు వచ్చాయి. ఏ అమ్మాయి కావాలో ఎంపిక చేసుకోండని సందేశం వచ్చింది. వివాహితుడు తనకు అలాంటి ఆలోచన లేదని సమాధానం ఇచ్చాడు. అంతే ..ఏదో ఒక అమ్మాయిని ఎంపిక చేసుకోవాల్సిందే ..లేదంటే నీ అంతు తేలుస్తాం ..బతుకు బజారుకీడుస్తాం అంటూ అవతలి వ్యక్తులు బెదిరించడం మొదలుపెట్టారు. వివాహితుడు తన భార్యతో దిగిన చిత్రాన్ని వాట్సాప్ డిపిగా పెట్టుకోగా ..ఆచిత్రాన్ని మార్ఫింగ్ చేసి పంపించారు. డబ్బులు ఇవ్వకుంటే ఆఫోటోలు వైరల్ చేస్తామని బెదించారు. దీంతో ఆవ్యక్తి పోలీసులు ఆశ్రయించాడు. ఇలా హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీస్ స్టేషన్‌లో నిత్యం ఇలాంటి కేసులే నమోదవుతున్నాయి. గతంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విట్టర్ వంటి మాధ్యమాల్లో ఫ్రెండ్ రిక్వేస్ట్ పెట్టేవారు. స్నేహం పేరిట దగ్గరై, ఆయా సామాజిక మాధ్యమాల్లో ఇతరులు పెట్టే పోస్టులు, డిపిల్లోని చిత్రాలను తీసుకుని..మోసగాళ్లు వారి ఖాతాలకు డిపిగా పెట్టుకునేవారు. ఎవరి చిత్రాలైతే తీసుకుని డిపిగా పెట్టుకున్నారో వారి స్నేహితులు, బంధువులకు చికిత్సకోసం డబ్బులు కావలని సందేశాలు పంపేవారు. ఇలా డబ్బులు దండుకున్న కేసులు ఎన్నోనమోదయ్యాయి. ఇప్పుడు కొత్తగా వాట్సాప్ డిపిలు తీసుకుని,వాటిని మార్ఫింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని సైబర్ క్రైం పోలీసులు తెలుపుతున్నారు.

**ఆ భ్రమలో ఉండొద్దు.. ఎక్కడున్నా పట్టుకుంటాం : సిపి సజ్జనార్**

స్మార్ట్‌ఫోన్ ఎంతోమంది అమ్మాయిలపాలిట శాపంగా మారుతోందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. సోషల్ మీడియా వినియోగం పెరిగాక అపరిచితులతో ఏర్పడుతున్న పరిచయాలు యువతులను ఊహించని ప్రమాదాల్లోకి నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కొన్ని విషాదకరఘటనలు తన దృష్టికి ఎక్కువగా వస్తున్నాయని.. ఆ కథనాలు చూశాక ఎంతో బాధనిపిస్తోందన్నారు. సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలని యువత, తల్లిదండ్రులకు సూచించిన ఆయన.. సైబర్ కేటుగాళ్లను హెచ్చరిస్తూ ఎక్ఓ వీడియో పోస్టు చేశారు.

"సైబర్ నేరస్థులు అందమైన యువకులు లేదా సినీ నటుల ఫొటోలను డీపీలుగా పెట్టి నకిలీ ఖాతాలతో అమ్మాయిలకు ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ లాంటి వేదికల్లో ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. వారి మాయమాటలకు ఆకర్షితులై కొందరు ఆడపిల్లలు గుడ్డిగా నమ్మేసి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు షేర్ చేస్తున్నారు. అవి పంపగానే ఆ అపరిచితులు రాక్షసుల్లా మారి బ్లాక్ మెయిల్‌కు దిగుతున్నారు. మార్ఫింగ్ చేసి డబ్బులు ఇవ్వాలని లేదా భౌతికంగా కలవాలని వేధింపులకు పాల్పడుతున్నారు. పరువు పోతుందన్న భయంతో ఇంట్లో చెప్పలేక కొందరు అడిగినంత డబ్బు ముట్టజెబుతూ తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. మరికొందరు ఈ వేధింపులు భరించలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలకు నేను చేసే విజ్ఞప్తి ఒక్కటే. సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండండి. ఆన్లైన్లో వేధింపులు ఎదురైతే భయపడకుండా ధైర్యంగా ముందుకు రండి. సైబర్ కేటుగాళ్ల బ్లాక్‌మెయిల్‌కు లొంగకండి. మీ ప్రాణాల్ని తీసుకోకండి. ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులు లేదా స్నేహితులకు చెప్పండి. ఏమాత్రం సంకోచించకుండా డయల్ 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వండి. పోలీసులు ఎప్పుడూ అండగా ఉంటారు. నకిలీ ప్రొఫైళ్లు, ఫేక్ నంబర్లు వాడితే పోలీసులకు దొరకబోమని సైబర్ కేటుగాళ్లు భ్రమపడొద్దు. మీరు ఎక్కడున్నా సరే పట్టుకొచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం" అని సజ్జనార్ హెచ్చరించారు.

# రంజాన్ వేడుకల్లో పాల్గొన్న క్రికెట్ మహ్మద్ సిరాజ్

హైదరాబాద్, మార్చి 21,ప్రభాతవార్త:

రంజాన్ పండుగను పురస్కరించుకుని భారత క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్ మెహదీపట్నం ఫస్ట్ లాన్సర్ ప్రాంతంలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పండుగ రోజు ఉదయం నిర్వహించిన నమాజ్‌లో ఆయన భక్తితో పాల్గొని దేశం, ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం సిరాజ్ తన స్నేహితులు, స్థానికులతో కలిసి పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు. అభిమానులు ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సిరాజ్ అందరితో సరదాగా మాట్లాడి, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. రంజాన్ పండుగను శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా భావిస్తూ ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# హోటళ్లలో తనిఖీలు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**: మల్కాజిగిరి నగరపాలక సంస్థ కమిషనర్ కృష్ణారెడ్డి**




వివరాలు అడిగితెలుసుకుంటున్న మల్కాజిగిరి నగరపాలక సంస్థ కమిషనర్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్ మార్చి 21 ప్రభాతవార్త** : మల్కాజిగిరి నగరపాలక సంస్థ (ఎంఎంసీ) పరిధిలో 99 రోజుల కార్యా చరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక్ర కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా శనివారం కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య పనులను, హోటళ్లలో ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. బోయినపల్లి సర్కిల్ పరిధిలోని ప్రకాష్ నగర్, బేగంపేట ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్, రహదారుల వెంట చెత్త సేకరణ తీరును పరిశీలించారు. ఎక్కడా చెత్త నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా నాలాల్లో చెత్త వేసే వారిపై నిఘా ఉంచి, నిబంధనలు ఉల్లంఘించే వారికి జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. నాలాల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు పలు సూచనలు చేశారు: వస్తువులను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వస్తువులపై తప్పనిసరిగా గడువు తేదీ ఉండాలని, హోటల్ కిచెన్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆహార పదార్థాల్లో రంగులు వాడరాదని, నిల్వ ఉన్న పదార్థాలను విక్రయించకూడదని బేకరీ యజమానులకు స్పష్టం చేశారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేని వ్యాపారస్తుల కోసం ప్రత్యేకంగా ఖిరిజిస్ట్రేషన్ మేళాఖి నిర్వహించినట్లు అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ తెలిపారు. అన్ని సర్కిళ్లలో కలిపి మొత్తం 149 మంది వ్యాపారస్తులతో కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆయన వెల్లడించారు.

# సెక్రటేరియట్ వద్ద పోకిరీల బైక్ స్టంట్స్



హైదరాబాద్, మార్చి 21 ప్రభాతవార్త

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం ప్రధాన రహదారి ఇప్పుడు బైక్ స్టంట్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అర్ధరాత్రి వేళల్లోనే కాకుండా, పగటి పూట కూడా యువకులు బైక్‌లపై సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. సచివాలయం, ట్యాంక్‌బండ్ పరిసరాలు ప్రమాదకరమైన బైకర్స్ స్టండ్స్‌కు అడ్డగా మారాయి. సచివాలయం ముందు కొందరు యువకులు బైక్‌లతో ప్రాణాలకు పణంగా పెట్టి విన్యాసాలు చేస్తున్నారు.ట్రాఫిక్ నిబంధనలను గాలికొదిలేసి అటుగా వెళ్లే ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నారు. వీలింగ్స్, స్టాపింగ్స్ చేస్తూ హల్చల్ చేస్తున్నారు. సెల్ఫీలు, రీల్స్ పిచ్చితో రిస్క్ తీసుకుంటున్నారు యువత. కొసమెరుపేంటంటే పోలీసుల ముందే పోకిరీలు స్టంట్స్ కలకలం రేపింది. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో అతివేగంతో దూసుకుపోతూ, వీలింగ్స్ చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. దీనివల్ల సాధారణ వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సీసీటీవీల ద్వారా నిఘా పెట్టి, భారీ జరిమానాలు విధిస్తున్నప్పటికీ ఈ ధోరణి తగ్గకపోవడం గమనార్హం.స్టంట్లు చేయాలనుకుంటే ప్రత్యేకమైన ట్రాక్స్, అనుమతి ఉన్న ప్రదేశాలకు చాలా ఉన్నాయి. అయినప్పటికీ ఇలా పబ్లిక్‌గా రోడ్లపై స్టంట్స్ చేయడం చర్చనీయాంశంగా మారింది. కనీసం హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, వారికే కాదు ప్రయాణికులకు ప్రాణహాని తప్పదని అంటున్నారు పలువురు. పోలీసులు స్పందించి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్‌గా కిరణ్‌కుమార్ గన్నమనేని విజయం



హైదరాబాద్,మార్చి 21 ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో కిరణ్ కుమార్ గన్నమనేని విజయాన్ని సాధించారు. శనివారం జరిగిన కౌంటింగ్‌లో ఆయన బార్ కౌన్సిల్ మెంబర్‌గా గెలుపు ఖరారైంది. జనవరి నెలలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ఎన్నికల ఫలితాలు గత నెల రోజులుగా కొనసాగిన కౌంటింగ్ అనంతరం శనివారం వెల్లడయ్యాయి. కిరణ్ కుమార్ ఇంతకుముందు నాంపల్లి బార్ అసోసియేషన్‌లో సెక్రటరీగా, అధ్యక్షుడిగా సేవలందించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. విజయం అనంతరం మాట్లాడిన ఆయన, అడ్వకేట్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.అదేవిధంగా అడ్వకేట్ల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఇతర బార్ కౌన్సిల్ సభ్యులతో కలిసి అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ సాధన దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కిరణ్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే శ్రీగణేష్



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

**అడ్డగుట్ట,మార్చి 21 ప్రభాతవార్త:** ఆశా వర్కర్ల సేవలు ఎనలేనివని, వారి న్యాయమైన కోర్కెల సాధనకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ హామీ ఇచ్చారు. శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని వివిధ ప్రభుత్వ, బస్తీ దావఖానాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలు,వారి డిమాండ్లను ఆయన దృష్టికి తెచ్చారు. ఆశా వర్కర్లసమస్యలను సిఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క,ఆరోగ్య శాఖ దామోదర రాజనర్సింహ్మల దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం ప్రతినిధులు యాదమ్మ, క్రిష్ణవేణి, భాగ్యలక్ష్మి, మీనా, సిఐటియు నేతలు ఆర్.మల్లేశ్, మహేందర్,దశరత్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారామ స్వామి వారి కల్యాణోత్సవాలు ప్రారంభం



పసుపు దంచే కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

**నిజాంపేట్, మార్చి 21, ప్రభాతవార్త**

మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా, బాచుపల్లి మండలం హరితవనం కాలనీలో మొదటి వార్డు మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో శ్రీ సీతారామ నవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం పందిరి రాకతో స్వామివారి కల్యాణోత్సవాలకు శుభారంభం జరిగింది. ఈ సందర్భంగా పందిరి రాట, ధ్వజారోహణం, పసుపు దంచే కార్యక్రమాలతో స్వామివారి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. భక్తుల మధ్య భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలు కొనసాగుతూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీరామ నవమి ప్రాముఖ్యత గురించి మాట్లాడిన నిర్వాహకులు, శ్రీరామ నవమి చైత్ర శుద్ధ నవమి రోజున జరుపుకునే పవిత్ర పండుగ అని, శ్రీరాముడు మహావిష్ణువు యొక్క ఏడవ అవతారమని పేర్కొన్నారు. ధర్మ పరిరక్షణ, సత్య నిష్ఠలకు శ్రీరాముడు ప్రతీకగా నిలిచారని తెలిపారు. సీతారాముల కళ్యాణం విశిష్టతను వివరిస్తూ, ఈ దివ్య కల్యాణం లోకక్షేమం, సకల దోష నివారణకు ప్రతీకగా భావిస్తారని, ఈ ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా భక్తులు పుణ్యఫలితాన్ని పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరితవనం కాలనీవాసులు, బీజేపీ నాయకులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సేవలు అందించారు.

## వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

**చాంద్రాయణగుట్ట, మార్చి 21, ప్రభాతవార్త :**

పాతబస్తీ చాంద్రాయణగుట్ట శ్రీ దేవి దేవాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఉగాది రోజున ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. అమ్మవారికి ప్రతిరోజు ఉదయం అభిషేకం, అలంకరణ, హారతి, సాయంత్రం ప్రత్యేక పూజలు, మహా హారతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సమీప బస్తీల భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి పూజా కార్యక్రమాలలో పాల్గొని దర్శించుకుంటున్నారు. సోమవారం పంచమి రోజున సామూహిక కుంకుమార్చన, బుధవారం సప్తశతి హవనం, గురువారం యజ్ఞ పూర్ణాహుతి ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ కోరారు. కాగా నవరాత్రుల సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, కొబ్బరి ఆకులు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాలు ఈనెల 26వ తేదీ గురువారంతో ముగుస్తాయి.

## నేడు ఎల్‌బి స్టేడియంలో వేలాది మందితో 'శ్రీవాసవీ మహాశక్తి మహోత్సవం'



**సైఫాబాద్, మార్చి 21 ప్రభాతవార్త:** ఈ నెల 22వ తేదీ ఆదివారం సాయంత్రం నగరంలోని ఎల్‌బి స్టేడియంలోఅద్భుత చారిత్రక ఘట్టానికి వేదిక కాబోతున్నది. ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ ట్రస్ట్ సౌజన్యంతో తెలంగాణ ఆర్య వైశ్య కార్పోరేషన్ ఆధ్వర్యంలో 'శ్రీవాసవీ మహాశక్తి మహోత్సవం' కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరగనుంది. సుమారు 30 వేల మంది వైశ్యులు ప్రముఖ కవి చింతల శ్రీనివాస్ రచించిన 102 చరణాల తో కూడిన వాసవీ పారాయణాన్ని సామూహికంగా అలపించనున్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వేలాది మంది ఒకే స్వరంతో పారాయణం చేయడం ప్రపంచ రికార్డు కానున్నదని నిర్వాహకులు తెలిపారు. ఈ ఘనతను రికార్డు చేయడానికి గిన్నీస్ ప్రతినిధులు కూడా రావడం జరిగిందని చెప్పారు. ఈ మేరకు శనివారం ఎల్‌బి స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్య వైశ్య కార్పోరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత గుప్తా ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ఆధ్యాత్మిక సేవా రంగాలలో ముందుండే ఆర్య వేశ్యులందరిని ఒక్క తాటిపైకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ఉద్ధేశమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్యఅతిధులుగా పాల్గొంటారని, గౌరవ అతిధులుగా ఎఐసిసి కార్యదర్శి మినాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, అనధికారులు, 16 రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు పాల్గొంటారని ఆమె వివరించారు. అందరికి ప్రవేశం ఉచితమని, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ప్రతినిధులు ఉమాకాంత్, శ్రీనివాస్‌గుప్తా, రవి గుప్తా తదితరుల పాల్గొన్నారు.



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం బోయిన్‌పల్లి, బొల్లారం, కార్ఖాన, మారేడ్‌పల్లి ప్రాంతాల్లోని పలు ఈద్గా, మజీద్‌లలో పాల్గొని ముస్లిం మైనార్టీలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



1వ వార్డు పెన్షన్ లైన్‌లో ముస్లిం మైనార్టీలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న జె.ఎం.ఆర్ తదితరులు



పవిత్ర పండుగ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సుభాష్ నగర్ ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న సురేష్‌రెడ్డి



సాయిబాబా నగర్‌లో పాల్గొన్న శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం



ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



ముషీరాబాద్ నియోజకవర్గంలో వివిధ మసీదుల వద్ద నిర్వహించిన రంజాన్ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



అలియాబాద్ జలమండలి కార్యాలయంలో రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ఉద్యోగులు



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న శంభుల శ్రీకాంత్‌గౌడ్,ఉష‌శ్రీ శ్రీకాంత్‌గౌడ్, పులి జగన్, గరిగంటి రమేష్ తదితరులు



పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి అజారుద్దీన్‌ని కలిసి శాలువాతో సత్కరిస్తున్న విజయరెడ్డి



రంజాన్ పర్వదినం సందర్భంగా సనత్ నగర్‌లోని వెల్ఫేర్ గ్రౌండ్‌లో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మన్నె గోవర్ధన్‌రెడ్డి.



ః రంజాన్ వేడుకల్లో పాల్గొన్న నవీన్‌యాదవ్



రంగారెడ్డిజిల్లా కాంగ్రెస్‌మాజీ అధ్యక్షులు కె.ఎం.ప్రతాప్‌ను సత్కరిస్తున్న కుత్బుల్లాపూర్ దత్తాత్రేయనగర్ మైనార్టీ సంక్షేమసంఘం నాయకులు



రంజాన్‌ను పురస్కరించుకుని చింతల్ చంద్రానగర్ కాలనీలో బిఆర్ఎస్ మహిళామండలి అధ్యక్షురాలు,వార్డు సభ్యులు మెహరున్నిస్సా బేగంకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంక్షేమసంఘం నాయకులు



గాంధినగర్ లో బీజేపీ మైనారిటీ నేత మహమూద్ ఆధ్వర్యంలో జరిగిన రంజాన్ వేడుకలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



బోయిన్‌పల్లిలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్ కాంగ్రెస్ నేత ముప్పిడి మధుకర్ తదితరులు

# మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ వేడుకలు

# బడ్జెట్‌లో బిసిలకు ప్రభుత్వం మొండి చెయ్యి

### 20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్
### 14 బిసిల సంఘాల సమావేశంలో ఆర్.కృష్ణయ్య

**సైఫాబాద్, మార్చి 21 ప్రభాతవార్త:**

బడ్జెట్‌లో బిసిలకు రాష్ట్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందని, అన్యాయం, దగా చేసిందని 14 బిసి సంఘాలు ధ్వజమెత్తాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది బిసిలకు ఇంకా తక్కువగా బడ్జెట్ కేయించి మోసం చేసిందని సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 14 బిసి సంఘాలు అత్యవసరంగా సమావేశమై బడ్జెట్‌పైన సమీక్షా నిర్వహించాయి. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3లక్షల 24 వేల కోట్ల బడ్జెట్‌లో బిసిలకు కేవలం 12 వేల 511 కోట్లు మాత్రమే కేటాయించి తీవ్రంగా అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో, కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రతి ఏడాది బడ్జెట్‌లో 20 వేల కోట్లు కేటాస్తామని ప్రకటించి, మూడేళ్ళగా బడ్జెట్‌లో అతి తక్కువగా నిధులు కేటాయిస్తూ చేసిన వాగ్ధానాన్ని విస్మరించిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం బడ్జెట్ కొత్త పథకాల గురించి ఊసే ఎత్తకపోగా, కొనసాగుతున్న పథకాలకు బడ్జెట్ పెంచలేదని, రోటిన్‌గా బడ్జెట్ పెట్టి బిసిల పట్ల ఏలాంటి ప్రగతి, పురోగతి చూపించలేదని ఆయన విమర్శించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయిస్తామని జివో తీసుకువచ్చి కోర్టులో కేసు ఉందని చేతులు దులుపుకుని, ప్రభుత్వం చేతిలో ఉన్న బడ్జెట్‌లో కూడా తగినంత కేటాయించకుండా అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వం అడుగడుగున బిసి వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని, బిసి కార్పోరేషన్, కుల సంఘాల ఫెడరేషన్‌లు, ఫీజుల రీయంబర్స్‌మెంట్, నిధులు కేటాయించలేదన్నారు. బలంగా బిసిల ఉద్యమం కొనసాగుతున్నప్పటికి, బడ్జెట్‌లో బిసిలకు అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బిసిలకు 20 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా ప్రతినిధులను ఘెరావ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశానికి బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షత వహించగా, 14 బిసి సంఘాల నాయకులు సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, అనంతయ్య, శివకుమార్, అశీష్ పటేల్, నిఖిల్‌పటేల్ పాల్గొన్నారు.



14 బిసి సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సంసద్ ఖేల్ మహోత్సవ్ : డాక్టర్ లక్ష్మణ్

### భోలక్‌పూర్ ఘంటసాల క్రీడా మైదానంలో బ్యాడ్మింటన్ పోటీలు

**ముషీరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:**

దేశవ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రధాని మోదీ సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట దేశవ్యాప్తం టగా క్రీడలు నిర్వహిస్తున్నారని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ తెలిపారు. శనివారం ఉదయం భోలక్‌పూర్‌లోని ఘంటసాల క్రీడా మైదానంలో ప్రధాని నరేంద్రమోదీ సంసద్ ఖేల్ మహోత్సవ్ మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా అక్షర స్ఫూర్తి ఫౌండేషన్, డాక్టర్ లక్ష్మణ్‌ల సంయుక్త ఆధ్వరవ్యంలో బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. మాజీ కార్పోరేటర్ పావని వినయ్‌కుమార్‌తో కలసి బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన లక్ష్మణ్ విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందచేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహి స్తున్న ప్రధాని మోదీ కొత్తగా క్రీడా పాలసీని తీసుకువచ్చారని పేర్కొన్నారు. బడ్జెట్‌లో క్రీడారంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింటంతో పాటు మహిపూర్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీని సైతం ఏర్పాటుచేశారని తెలిపారు. ప్రధాని ఆదేశాల మేరకు గత నెల రోజులుగా యువతను ప్రోత్సహిస్తూ వివిధ రకాల క్రీడలు నిర్వహిస్తున్నామని అన్నారు. యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2036లో దేశంలో జరిగే కామన్ వెల్త్ క్రీడల్లో మన రాష్ట్రం నుంచి క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని, పథకాలు సాధించే విధంగా క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని సూచించారు. ఆదివారం భువనగిరిలో జరిగే క్రీడల ముగింపు మహోత్సవానికి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్‌శక్లా, కేంద్ర మంత్రులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కే.రాహుల్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, బీజేపీ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్‌కుమార్, మాజీ కార్పోరేటర్ రవిచారి, బీజేవైఎం నగర అద్యక్షులు మద్దూరి శివాజీ, గాంధీనగర్ డివిజన్ అద్యక్షులు నవీన్‌కుమార్, నాయకులు బొల్లంపల్లి రామ్‌రెడ్డి, రత్న సాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, ఉమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ కే.లక్ష్మణ్

# పురాణ ప్రవచన చక్రవర్తి ఉషశ్రీ

**చిక్కడపల్లి, మార్చి 21 ( ప్రభాతవార్త ) :** ఉషశ్రీ గా తెలుగు వారికి తెలిసిన పురాణపండ ప్రకాశ దీక్షితులు పురాణ ప్రవచన చక్రవర్తి అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఉషశ్రీ ఆకాశవాణి లో చేసిన ప్రసంగాలు కోసం నాడు ఎదురు చూసేవారనీ గుర్తు చేశారు శనివారం త్యాగరాయగానసభ లో గానసభ నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం లో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధుర స్మృతులలో భాగంగా ఉషశ్రీ స్మరణ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ ఉషశ్రీ తెలుగు సాహిత్యాన్ని, పురాణాలను సామాన్యులకు అర్ధమయ్యే సరళ శైలిలో అందించడంలో అగ్రగణ్యులని ప్రశంసించారు. ఆయన రచనలు, ప్రసంగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గానసభ అధ్యక్షులు కళా వి.ఎస్. జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. నిరంతరం సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలతో గానసభ కళాకారులకు వేదికగా నిలుస్తుందని తెలిపారు. సభలో జీవీఆర్ ఆరాధన కల్చరల్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి.వి. రాఘవ రెడ్డి, ప్రముఖ గాయకులు ద్రోణరాజు రామ్, గానసభ పాలకమండలి సభ్యురాలు శ్రీమతి గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన గజ్జెల నాగేశ్



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న గజ్జెల నాగేశ్ తదితరులు

**కంటోన్మెంట్,మార్చి 21 ప్రభాతవార్త:** టీపిసీసీ మైనార్టీసెల్ వైస్ చైర్మన్ మహ్మద్ అరుణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకల్లో బేవరేజెస్ కారోపరేషన్ మాజీ చైర్మన్,తెలంగాణ ఉద్యమ నేత గజ్జెల నాగేశ్ ప్రార్ధనలు నిర్వహించి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## శోభయాత్ర ఆహ్వాన కరపత్రాల పంపిణి



కరపత్రాలను పంపిణి చేస్తున్న అమృత

**హైదరాబాద్, మార్చి 21 ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన జరగనున్న 'శ్రీరామనవమి శోభాయాత్ర' సందర్భంగా ఓల్డ్ రామాలయం దేవాలయం, నల్లకుంట ప్రాంత వాసులకు శనివారం ఆహ్వాన కరపత్రాల పంపిణి కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ అమృత, డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్‌జోషి, మధుయాదవ్, శిరీషా, జేకె బాబు, సుబ్రహ్మణ్యం, అశోక్ బిర్లా, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

## వివేక్‌నగర్ అంజన్న క్షేత్రంలో రేపటి నుండి విశేష పూజలు



వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం

**చిక్కడపల్లి, మార్చి 21 (ప్రభాతవార్త ) :**

చిక్కడపల్లి పరిధిలోని వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థాన పునర్నిర్మాణానంతర చతుర్థ వార్షికోత్సవాలు, శ్రీ సీతారామ కల్యాణం, శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలు గణపతి హోమంతో కార్యక్రమాలు ప్రారంభమైనాం. శనివారం ఉదయం ప్రత్యేక పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా వేదపండితులు జరిపించారు. ఏప్రిల్ 4 వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. కాగా శనివారం నుండి ఉత్సవాల్లో భాగంగా వివిధ రకాల హోమాలు, కళ్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. 22 న శ్రీ లక్ష్మీదేవి హోమం, 24 న శ్రీ హనుమత్ కార్యసిద్ధి హోమం, 25 న శ్రీ వేంకటేశ్వర కల్యాణం, 27 న శ్రీ సీతారామ కల్యాణం ఉంటుందని వివరించారు. కాగా 28 న శ్రీ రామ పట్టాభిషేకం, 29 న సుదర్శన హోమం, 30 న శ్రీ రామ తారక హోమము, 31 న చండీ హోమం ఉంటుందని అన్నారు. కాగా ఏప్రిల్ ఒకటవ తేదీన నవగ్రహ రుద్ర హోమం, 2 న శతకలశ ఘటాభిషేకం వంటి ఆద్యాత్మిక కార్యక్రమాలు ఉంటిని, భక్తులు పెద్ద సంఖ్య లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వాసవి మాత పారాయణం ఆహ్వానం


ఆహ్వానపత్రికను సీఎం రేవంత్ రెడ్డి కి అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కాల్వ సుజాత, చిత్రంలో కొటికె విఠల్ తదితరులు

**చిక్కడపల్లి మార్చి 21 ( ప్రభాతవార్త ) :** నగరంలో ప్రతిష్ఠాత్మక ఎల్బీ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన శ్రీశ్రీ వాసవి మాత సామూహిక పారాయణంకి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని నిర్వాహక కమిటీ శనివారం కోరింది. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కాల్వ సుజాత గారి నేతృత్వంలో ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకగా కలిసిన ప్రతినిధి బృందం, ఈ కార్యక్రమ అధికారిక ఆహ్వాన పత్రికను అందజేసింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ , ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కొటికె విఠల్, బెల్లి శ్రీధర్, కొల్లూరి రమేష్, కె.పి.సి. అనిల్, పాలబట్ల ఆనంద్, భవాని సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ పారాయణ మహోత్సవం ఎల్బీ స్టేడియంలో అత్యంత వైభవంగా జరగనుందని, భక్తులందరూ భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు.

## నవ్య "వసంతోత్సవం"


వసంతోత్స వం" పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న జి. వసుంధర. చిత్రంలో డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, డాక్టర్ వై. చలపతిశాస్త్రి , నిష్టల సుధామాల, వేమరాజు విజయకుమార్

**చిక్కడపల్లి మార్చి 21 ( ప్రభాతవార్త ) :** శ్రీ పరాభవ నామ ఉగాదిని పురస్కరించుకొని వసంతోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నవ్య సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, నవ్య నాటక సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తెలిపారు. శనివారం చిక్కడపల్లి లో 24 న శ్రీకృష్ణదేవరాయ తెలుగు బాషా నిలయంలో జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, వేమరాజు విజయకుమార్, డాక్టర్ వై. చలపతిశాస్త్రి , నిష్టల సుధామాల లతో కలిసి రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి. వసుంధర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాషా నిలయంలో జరిగే వేడుకల్లో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన బాలాంత్రపు వెంకటరమణ (సాహిత్యం), డాక్టర్ పావని వైజర్సు (సంగీతం), డాక్టర్ వై. చలపతి శాస్త్రి (నృత్యం), ఆచార్య వంగపల్లి విశ్వనాథం (వ్యక్తిత్వ వికాసం), డాక్టర్ ఆర్. చంద్రశేఖర్ (వైద్య విద్య)లకు నవ్య వసంతోత్సవ పురస్కారాలు అందజేయనున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి ముఖ్య అతిథిగా హాజరై అవార్డులు ప్రదానం చేస్తారని, అనంతరం ప్రముఖ కవులతో ఉగాది కవిసమ్మేళనం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి యు.హెచ్. హరినాథ్ బాబు, కె. చక్రపాణి, యు. సత్యవాణి పాల్గొన్నారు.

## ఈదుల్-ఫీతర్ ముబారక్


టిఎన్‌జిఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్‌హుస్సేనీ నీ సన్మానించిన దృశ్యం

**గన్‌ఫౌండ్రి, మార్చి 21ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని శనివారం ముస్లీం సోదరులు పలు మజీద్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈదుల్-ఫీతర్ రంజాన్ ముబారక్‌అంటూ తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదరి డాక్టర్ ముజీబ్‌హుస్సేనీ నివాసంలో హైదరాబాద్ జిల్లా టిఎన్‌జిఓ అధ్యక్షులు విక్రమ్ కుమార్,కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్ కలిసి పండుగ శుభకాంక్షలు తెలిశాలువ కప్పి సన్మానించారు.ఈకార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు నరేష్, కార్యవర్గ సభ్యులు శ్రీధర్,వివిధ యూనిట్ల అధ్యక్షులు,కార్యదర్శులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం



**బేగంబజార్,మార్చి 21ప్రభాతవార్త :** రాబోయే మహానగర పాలక సంస్ధ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనిమరింత బలోపేతం చేస్తామని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు ఎస్.ధన్‌రాజ్‌మాదిగ, సతీష్‌గౌడ్‌లు అన్నారు.ఈమేరకు ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మోతా రోహిత్‌ముదిరాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు.ఈసందర్బంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా బడ్జెట్ అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యదర్శులు విజితారెడ్డి, దాసరి రాజ్‌కుమార్, ముండ్రాయి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

### రంజాన్ పండుగ సందర్బంగా నిత్యావసర సరుకులు పంపిణీ



**చార్మినార్,మార్చి 21 ప్రభాతవార్త :** రంజాన్ పండుగ సందర్బంగా పాతబస్తీలోని నిరుపేద ముస్లింలకు మాజీ రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ,డాక్టర్ వసీం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచంద్రారావు శనివారం పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు.ఈ సందర్బంగా మాజీ రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రి మాట్లాడుతూ ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్ పండుగ) సందర్బంగా బిజెపి సౌగత్-ఎ-మోదీ పేరుతో పాత బస్తీలోని పేద ముస్లింలకు నిత్యావసర సరుకుల కిట్లను కిట్లను పంపిణీ చేశామని తెలిపారు.

## తెలుగుభాషా సంస్కృతిని కాపాడుకుందామని శపథం చేద్దాం

- సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ


ద్వారంలక్ష్మికి కిన్నెర ఉగాది పురస్కారం ప్రదానంచేస్తున్న జస్టిస్ ఎన్.వెంకటరమణ, కె.వి.రమణాచారి, రఘురామ్, భోగరాజుమూర్తి తదితర అతిథులు

**రవీంద్రభారతి, మార్చి 21 ప్రభాతవార్త :** తెలుగుజాతి తొలి ప్రధాన పండుగ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మన తెలుగు భాష, సంస్కృతి, కళలు, సంప్రదాయాలను కాపాడుకుందామని భారతదేశ సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ పిలుపునిచ్చారు. ఎంతో ప్రాముఖ్యతను, ఆదరణ పొందిన తెలుగుభాషను ఉభయ తెలుగురాష్ట్రాల్లో చిన్నచూపు చూడడం బాధాకరమన్నారు. వీటిని విస్మరిస్తే యావత్ జాతికే మనుగడ ఉండదని జస్టిస్ హెచ్చరించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన ఉగాది వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, గౌరవ అతిథులు భోగరాజు మూర్తి, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, సభానుసంధానకర్త మడిపల్లి దక్షిణామూర్తి తదితరులతో కలిసి వివిధరంగాలకు చెందిన పలువురు ప్రముఖులు జస్టిస్ జి.రోహిణి, ఎ.వి.రంగనాథ్, డా. ఎస్.వి.ఎస్.నారాయణమూర్తి, ఐ.గణపతిరెడ్డి, డా. ఐ.విశ్వనాథరెడ్డి, పొత్తూరి విజయలక్ష్మి, డా. ద్వారం లక్ష్మి, కాజా వెంకట సుబ్రహ్మణ్యం, బి.అమరేంద్ర, సరసి, పి. జగన్మోహనరావు, జి.ఎస్.ఎస్.శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించి కిన్నెర-శ్రీపరాభవ నామ ఉగాది పురస్కారాలను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. మద్దాళి రఘురామ్ స్వాగతోపన్యాసంలో కిన్నెర ఉగాది పురస్కారాల ప్రస్థానాన్ని, చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను సవివరపరిచారు. సభకుముందు కళారత్న డా. ద్వారం లక్ష్మి శాస్త్రీయ సంగీత కచేరి ఆహుతులకు వీనులవిందు చేసింది.

## జీవితాలలో మార్పులు రావాలంటే రాజకీయంగా రాణించాలి


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర సగర సర్వసభ్య సమావేశం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి మార్చి 21 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్రంలో సగరులు రాజకీయంగా ఎదిగినప్పుడే జీవన స్థితిగతులలో మార్పు రాగలదని, దీని కోసం ప్రతి ఎన్నికల్లో సగరులు పోటీ చేయాలని తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర సగర సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన శేఖర్ సగర మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 39 మంది సగరులు సర్పంచులు గా గెలుపొందారని, 9 మంది కౌన్సిలర్ లుగా, కార్పొరేటర్ లుగా విజయం సాధించారని, భవిష్యత్తులో హైదరాబాద్ నగర పాలక సంస్థకు కు జరిగే ఎన్నికల్లో సగరులు అనేక డివిజన్లలో పోటీ చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ కేంద్రంగా దాదాపు లక్ష మందికి తగ్గకుండా శంఖారావం పేరిట పెద్ద బహిరంగ సభను నిర్వహించి ఈ రాజకీయ పార్టీలకు సగరుల చైతన్యం ఏంటో చాటి చెబుతామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా సగరులను బి.సి. డి గ్రూప్ నుండి ఏ గ్రూప్ కు మార్చాలని కోరారు. సంచార జీవనం సాగించే సగరులను దాదాపు అగ్రకులాల సరసన చేర్చి గత.ప్రభుత్వాలు అన్యాయం చేశాయని ఆరోపించారు. అదేవిధంగా సగరులకు ఫెడరేషన్ కాకుండా సగర కార్పొరేషన్ ను ప్రత్యేకంగా ఈ ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేసి చైర్మన్ ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముత్యాల హరికృష్ణ సగర, సగర భగీరథ ఆత్మగౌరవ భవన వెల్ఫేర్ చైర్మన్ ఆస్కాని మారుతి సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి సగర, రాష్ట్ర గౌరవ సలహాదారులు ఆర్.బి ఆంజనేయులు సగర, రాష్ట్ర మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లవి సగర, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి సగర, కోశాధికారి జయమ్మ సగర, సలహాదారులు మనీ మంజరి సగర, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సురేష్ సగర, ప్రధాన కార్యదర్శి మహేందర్ సాగర్, కోశాధికారి సాయి గణేష్ సగర, రాష్ట్ర సంఘం నాయకులు, జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు విద్యా సంఖ్యలు హాజరయ్యారు.

### బడ్జెట్ కేటాయింపుల్లో బిసిలకు తీరని అన్యాయం

**తలకొండపల్లి, మార్చి 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో బిసిలకు తీరని అన్యాయం జరిగిందని తలకొండపల్లి బిసి సంక్షేమసంఘం మండ ల అధ్యక్షులు గుజ్జరి రాఘవేందర్ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొత్తం 3,24,234 లక్షల కోట్ల బడ్జెట్‌లో 56శాతానికి పైగా ఉన్న బిసిలకు కేవలం 3.8శాతం నిధులు కేటాయించి బిసిల గొంతుకోసి తీరని అన్యాయం చేశారన్నారు. కనీసం బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తారని ఆశించినా ఫలితం శూన్యంగా మారిందన్నారు. అప్పులేమో బిసిలకు సంపదేమో అగ్రవర్ణాలకా అని ప్రశ్నించారు. ఇప్పటి కే గ్లోబలైజేషన్, లిబరైజేషన్ మార్పులతర్వాత పెద్ద ఎత్తున యాంత్రీకరణ జరగడంతో పెద్ద పరిశ్రమలు, కంపెనీలు రావడంతో చేతివృత్తులు కుల వృత్తులు దెబ్బతిన్నకారణంగా బిసిల బ్రతుకులు రోడ్ల పాలవుతున్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం మేల్కొని 40వేల కోట్లు కేటాయించి బిసిలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. అంతే కాకుండా 30వేల కోట్లతో బిసి సబ్‌ప్లాన్ ప్రవేశపెట్టి అమలుచేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

### బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి: ఎస్‌ఎఫ్ఐ

**పరిగి, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యా రంగానికి మొండిచేయి చూపించిందని పరిగి డివిజన్ అధ్యక్షులు శివ శంకర్, కార్యదర్శి కలీమ్ మండిపడ్డారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్ఐ పరిగి డివిజన్ అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ.. ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసం గంలో భారీహామీలు అని గొప్పపదజాలం వినిపించినా క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపలేద న్నారు. ప్రభుత్వం వాస్తవంగా విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఎస్‌ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. మొత్తం రూ.3,24,234 కోట్ల బడ్జెట్ విద్యకు కేవలం రూ.26,674కోట్లు(8.22) మాత్రమే కేటాయిం చడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో సుమీర్, చరణ్, తదిత రులు పాల్గొన్నారు.

## సిపిఐ బానోరి లింగంగౌడ్ వర్ధంతి

**చేవెళ్ల, మార్చి 21, ప్రభాతవార్త:** సిపిఐ నాయకుడు బానోరి లింగంగౌడ్ 25వ వర్ధంతి మొయినాబాద్ మండలంలోని తోలుకట్టలోని స్థూపం దగ్గర జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించడం జరిగింది. ముఖ్యఅతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభులింగం, చేవెళ్ల కాంగ్రెస్ లేబర్‌సెల్ జనరల్ సెక్రెటరీ, ఆయన కుమారుడు శివ శంకర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ ఆశయాల కోసం అనునిత్యం బడుగు, బలహీన వర్గాలకోసం పెత్తందార్ల పైన పోరాటం చేసిన నాయకుడు కామ్రేడ్ లింగంగౌడ్ అని అన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**శామీర్‌పేట, మార్చి 21, ప్రభాతవార్త:** హకీంపేట్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి కావటంతో లబ్దిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లను మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్ ప్రారంభించి వారితో గృహప్రవేశం చేయించారు. శనివారం శామీర్ పేట మండలంలోని హకీంపేట్‌లో ఇందిరమ్మ ఇంటినిర్మాణం పూర్తికావటం తో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. లబ్దిదారులు వజ్జల కళావతి యాదగిరి దంపతులు నిర్మించుకున్న ఇంటికి ప్రభుత్వం 5లక్షల రూపా యలు మంజూరు చేయటంతో నిర్మాణ పనులు పూర్తిచేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్‌కమిటీ చైర్మన్ బి. నర్సింలుయాదవ్, ఇందిరమ్మ కమిటీసభ్యులు ఆర్.శ్రీనివాస్‌యాదవ్, వి. శశాంత్‌ల ఆధ్వర్యంలో ప్రారంభ కార్యక్రమం జరిగింది. దీనిలో వారితో పాటు అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్, మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, అల్వాల్‌సొసైటీ మాజీ డైరెక్టర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పి.బాల్‌రాజ్, ఎండి జాఫర్, ఎం.బిక్షపతి, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శశిధర్‌రెడ్డి, నాయకులు పాండు, నక్క మల్లేశ్‌గౌడ్, కె.వెంకటేశ, కీసరి బానుచందర్‌లు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న జంప్ జిలానీల పర్వం

**నందిగామ, మార్చి 21, ప్రభాతవార్త:** ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నచ్చి కాంగ్రెస్‌లో ప్రతిపక్షపార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు చేరుతున్నారు. నందిగామ మం డలం వెంకమ్మగూడ బిఆర్‌ఎస్ సర్పంచి గొర్లపల్లి అశోక్, ఉపసర్పంచి వద్దే యాదయ్య, వార్డుసభ్యులు సునీతరాజు, స్వప్నవిజయ్, సుశీలరవి, వేణ ప్ప, మాలనర్సింలు, వద్దే శీను, వేణుగోపాల్, మాజీ కోఆప్షన్ సభ్యులు వద్దే నారాయణ, రాజయ్యతోపాటు పలువురు బిఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రంగాపూర్‌లో బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన సర్పంచి గోవు అంజమ్మ, ఉపసర్పంచి బసవరాజ్‌తో పాటు 6మంది వార్డుసభ్యులు, యువకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండలంలో మరికొంతమంది సర్పంచులు, వారి అనుచరగణంతో భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తాలు ఖరారు చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా సమాచారం.

### సిసి రోడ్డును ప్రారంభించినసర్పంచి, ఉపసర్పంచి

**చేవెళ్ల, మార్చి 21, ప్రభాతవార్త:** చేవెళ్ల మండలపరిధిలోని ఎన్కేపల్లిగ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో సిసిరోడ్డును ప్రారంభించిన సర్పంచి బొమ్మిడి మైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో రోడ్లు వేయించుకోవడం జరుగుతుందని అన్నారు. గ్రామప్రజల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధిచేసి ప్రజల నమ్మ కాన్ని నిలబెట్టుకుంటామని సర్పంచి అన్నారు

## తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి

**న నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్**

**నాంపల్లి, మార్చి 21 ప్రభాతవార్త :** తెలుగుభాషా సాంస్కృతికరంగాలలో తెలంగాణను దేదీప్యమానం చేసిన గొప్ప పద్యకవి సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ వైతాళికుల్లో ఒకడని ప్రముఖ రచయిత, నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో కరీంనగర్ జిల్లా జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డా. గండ్ర లక్ష్మణరావు రచించిన సురవరం ప్రతాపరెడ్డి పద్య సౌరభం గ్రంథాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన జీవి శ్యాంప్రసాద్ లాల్ ఆవిష్కరించారు. పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవి ద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివాఆరెడ్డికి ఈ గ్రంథాన్ని అంకి తం చేశారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి మహాకవుల స్థాయిలో వ్రాసిన పద్యాలను గురించి ఒక గ్రంథం వ్రాయడంతో ఆయన పద్యాలలోని సాహితీ మూల్యాలపై చర్చకు అవకాశం కలిగిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి సురవరం ప్రతాపరెడ్డి రచించిన అనేక పద్యాలను ప్రస్తావిస్తూ ప్రసంగించారు. కృతిస్వీకర్త స్పందనలో తెలంగాణ వైభవాన్ని ప్రతిబింబింపజేస్తూ ప్రతాపరెడ్డి రచించిన పద్యాలు ప్రత్యేకమైనవన్నారు. తెలంగాణ వాడుక పదాలతో సీసపద్యం రాసిన ఘనత ఆయనదే అన్నారు. కార్యక్రమానికి జాతీయ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు గాజుల రవీందర్ అధ్యక్షత వహిం చారు. సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, సాహితీవేత్తలు సూర్యనారాయణమూర్తి, సంగనభట్ల నరసయ్య పాల్గొన్నారు.

## అల్వాల్‌లో పద్మ శ్రీ బ్రహ్మశ్రీ గరికపాటి దివ్య ప్రవచనం


ప్రవచనం చెబుతున్న గరికపాటి

**అల్వాల్, మార్చి 21 ప్రభాతవార్త:** శ్రీ సీతారామ నామ సంకీర్తన సంఘం దేవుని అల్వాల్ వారి సౌజన్యనంతో అంగరంగ వైభవంగా నవరాత్రోత్సవాలు జరుగుతున్నాయి. ఈ నెల 19 తేదీ నుంచి 29 వరకు జరిగే ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. ఈ నెల 21 శనివారం సాయంత్రం పద్మ శ్రీ బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు దివ్య ప్రవచనం జరిగింది. బ్రహ్మశ్రీ ప్రవచనం కోసం వందలాదిగా పట్టణ ప్రజలు తరలివచ్చారు. హరిదాస మండపం శ్రీ సీతారామ మందిర ప్రాంగణం ఇందుకు వేదికగా నిలిచింది. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు వాటి విశిష్టితను ఆయన వివరించారు. పండుగలు అవశ్యకతలను వివరిస్తూనే సమాజం ఐక్యంగా ఉండాలని సూచించారు. నాటి, నేటి తరం మధ్య ఉన్న వ్యత్యాసాలను తనదైన శైలిలో వ్యంగా శాస్త్రాలుతో నవ్వులు పూయించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ నామ సంకీర్తన సంఘం ప్రతినిధులు పరాంకుశం మాధవ్, రామచంద్రం, సుదర్శన్ రెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్, నిమ్మ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది, గుడి పాడ్వా పేర్లు వేరైనా ఆత్మ ఒక్కటేనని

**హిందీ సాహితీ వేత్త, అనువాదకులు చంద్రకాంత్ భోంజాళ్**


ఉగాది పురస్కార గ్రహీతలతో అతిథులు

**సైఫాబాద్, మార్చి 21 ప్రభాతవార్త:** ముంబాయిలో ఖార్‌లో తెలుగు వారి ఉగాది మరాఠి వారి గుడి పాడ్వా సంబరాలు ఘనంగా జరిగాయి. మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సభకు ముఖ్యఅతిధిగా విచ్చేసిన ప్రసిద్ద మరాఠి, హిందీ సాహితీ వేత్త, అనువాదకులు చంద్రకాంత్ భోంజాళ్ మారాఠి తెలుగు అనుబంధాలపై మాట్లాడుతూ ఉగాది, గుడి పాడ్వా పేర్లు వేరైనా ఆత్మ ఒక్కటేనని విశ్లేషించారు. ఎన్నో మరాఠి పుస్తకాల తెలుగు అనువాదాల లభ్యత గురించి ఆయన వివరించారు. తంజాపూర్ పరిపాలించిన మరాఠి రాజులు నాడు తెలుగులో కావ్యాలు రాశారని ఆయన గుర్తు చేశారు. గుర్రం బాల్‌రాజ్, శ్రీపరాభవ నామ పంచాంగ శ్రవణం చేశారు. అంతకు ముందు చిన్నా రుల ఉగాది నృత్యం మహిళల బతుకమ్మ నృత్యాలు వీక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టిఎఎం అధ్యక్షుడు గంజీ జగన్‌బాబు, కంటె అశోక్, మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ కార్యదర్శి సచిన్ నింబాల్ తదితరులు పాల్గొన్నారు

### ఆహార కల్తీ తయారీ కేంద్రం జియాగూడ అడ్డా....

**జియాగూడ,మార్చి 21ప్రభాతవార్త:** నగరంలోనే కాకుండా ప్రత్యేక జియాగూడ పరిధిలో మొన్నకుళ్లిన చికెన్,నిన్న కల్తీ అల్లం,అల్లం పేస్ట్,నేడు కల్తీ సమోసాలతో తయారీదారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తున్న విషయం,స్థానికవివిధ పార్టీల నాయకులకు తెలిసినప్పటికి చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు,కుల్సుంపురా పోలీసులు మెరుపు దాగులు నిర్వహించి కల్తీ ఆహార పదార్థాలను తయారీ చేస్తున్న గోడౌన్‌పై దాడి చేసి పట్టుకున్నారు.అసలుపరిశుభ్రత పాటించకుండా ఇష్టానుసారంగా కల్తీ ఆహార పదార్థాలతో సమోసాలు చూస్తే ఒళ్లుజల్లదిరిస్తుంది.ఇన్ని రోజులు ఇలాంటి ఆహార పదార్థాలను తిన్నామా అని చర్చించుకుంటున్నారు.ఈ తనిఖీలో సదరు తయారీ కేంద్రంపై ఎటువంటి పాసి లైసెన్స్,ట్రేడ్‌లైసెన్స్,లేదా ఫైర్ స్టేఫ్టీఅనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.తయారీదారుడు అబ్దుల్‌రషీద్(73)అత్యంతఅపరిశుభ్రమైన వాతావరణంలో కుళ్లిపోయిన గుడ్లు,పదే,పదే మరిగించిన నూనెను ఉపయోగిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాడు.సీజ్ చేసిన వస్తువులు సుమారు 5లక్షలవరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.ముడిపదార్థాలు 50కిలోలు,సమోసా పట్టీలు,అపరిశుభ్రత మైన స్వీట్‌కార్న్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.అన్ని వస్తువులను సీజ్‌చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసును కుల్సుంపురా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### వైభవంగా ఎల్లమ్మతల్లి కళ్యాణోత్సవం

**ఆమనగల్లు, మార్చి 21, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలోని ఎల్లమ్మతల్లి దేవాలయం తృతీయ వార్షికోత్సవం అంగరంగవైభవంగా సాగింది. మూడురోజుల పాటు నిర్వహించిన వార్షిక ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరైనారు. ఆలయ నిర్వాహకులు లాలయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు కన్నులపండువగా జరగగా, గ్రామ భక్తులతోపాటు ఇతర ప్రాంతాల భక్తులు హాజరై అమ్మవారి కళ్యాణాన్ని తిలకించారు. ఎల్లమ్మతల్లి ఆలయ వార్షిక వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. చివరిరోజు బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు, ఎంపిటిసిల సంఘం మాజీ అధ్యక్షుడు దోనాదుల కుమార్, గ్రామసర్పంచు వెంకటయ్యతోపాటు పలువు రు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ తరపున వీరిని నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు, యువ కులు తదితరులు ఉన్నారు.

### శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ అధ్యక్షులుగా రాయిల శ్రావణ్‌కుమార్‌గుప్తా

**కీసర, మార్చి 21, ప్రభాతవార్త:** కీసర శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ నూతన అధ్యక్షులుగా రాయిల శ్రావణ్‌కుమార్‌గుప్తా ఎన్నికయ్యారు. శనివారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఆనబోయిన జంగయ్య, గౌరవ అధ్యక్షులుగా గుర్రం మల్లారెడ్డి, ఉపాధ్య క్షులుగా శీలం శ్రీనివాస్, బండారి శంకర్‌గౌడ్, చినింగణి బాలరాజు, కనబో యిన రమేష్, మిట్టపల్లి రాఘవేందర్‌గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా పిన్నిం టి క్రిష్ణారెడ్డి, గోరంటి ప్రవీణ్, మెట్టు సతీష్‌యాదవ్, సుమన్ బన్నీ, జూపల్లి చంద్రయ్య, కోశాధికారి జూపల్లి రవీందర్, కార్యవర్గసభ్యులు మెట్టు పరమేష్‌యాదవ్, చినింగణి సుధాకర్, అల్లాదుర్గం ఆంజనేయులు, పన్నాల బుచ్చిరెడ్డి, వెంకటేష్‌యాదవ్, అల్లాదుర్గం ఆంజనేయులు, వెంకటేష్, సల హాదారులుగా నాయకపు వెంకటేష్, పన్నాల బుచ్చిరెడ్డి, వెంకటేష్‌యాదవ్, పన్నాల సుధాకర్‌రెడ్డి, బెలిదె రమేష్‌గుప్తా, మచ్చాని జంగయ్యయాదవ్, పెద్దమచ్చాని జంగయ్యయాదవ్, నల్ల వెంకట్‌రెడ్డి, శీలం మల్లేష్, అంజిరెడ్డి, మెట్టు మహేందర్‌యాదవ్, జూపల్లి అశోక్, మదూరి రవీందర్, కర్రె గణేష్ లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం

**మాడ్గుల, మార్చి 21, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండమండలంలోని శిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి ఆలయానికి రాష్ట్రప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు కేటాయించినందుకు శ్రీరామదండు రాష్ట్ర అధ్యక్షుడు దండు శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి బాధ్యతలు చేపట్టి ఆలయానికి నిధులు కేటాయించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఈ నిర్ణయం స్థానిక భక్తుల ఆశలను నెరవేర్చిందని తెలిపారు. సీతారామచంద్రస్వామి ఆలయాన్ని మినీభద్రాద్రిగా అభివృద్ధిచేయాలనే లక్ష్యంతో రూ.500కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి స్వయంగా ప్రత్యేక పర్యటన చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిధులతో ఆలయ పరిసరప్రాంతాల అభివృద్ధి, భక్తులకు సౌకర్యా ల విస్తరణ జరిగే అవకాశం ఉందని, ఇది ప్రాంతీయాభివృద్ధికి దోహదపడు తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

### నేడు రైతుభరోసా నిధుల విడుదలపై వీడియో కాన్ఫరెన్స్

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 21, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయాగ్రామాలలోగల రైతువేదికలలో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం ప్రత్యక్షప్రసారం వస్తుందని మండ ల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుభరోసా నిధులవిడుదల, ఆయిల్‌పామ్ ప్రారం భోత్సవ కార్యక్రమాలు వీక్షించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు మండలంలోని పెద్దఎల్కిచర్ల, ఎదిర, చౌదరిగూడ రైతువేదికల ద్వారా వీక్షించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్నిగ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్య క్రమం మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు.

### స్వయంసహాయ సంఘాల భవననిర్మాణానికి భూమిపూజ

**తలకొండపల్లి, మార్చి 21, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలపరిధిలోని వెంకటరావుపేట్‌గ్రామంలో స్వయంసహాయ సంఘాల భవననిర్మాణానికి సర్పంచి ఇమ్మడి మహేష్ భూమిపూజ చేశారు. శనివారం వెంకట్రావుపేట్ సర్పంచి ఉమ్మడి మహేష్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సభ్యులు, స్వయంసహాయక సంఘాల సభ్యులందరితో కలిసి భవననిర్మాణాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మహిళాసంఘాల వారికి భవనం లేకపోవడంతో, మహిళాసమావే శాలకు, అనేక ఇబ్బందులకు గురయ్యేవారని, వారి అవసరంనిమిత్తం స్వయం సహాయ సంఘాలకు భవనానికి త్వరలో నిర్మాణం పూర్తిచేసి వారికి సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి పోలే ప్రశాంతి, మాజీసర్పంచి కించ హైమావతిరమేష్, బుక్‌కీపర్ గాజుల అరుణ, ఫీల్డ్ అసిస్టెంట్ కంభంపాటి సత్యం, సభ్యులు గువ్వ శంకరయ్య, కానుగుల భాగ్యమ్మ, ముక్తాల సంతోష, బలగం పాల్గొన్నారు.

### PUBLIC NOTICE

The General Public are hereby informed that my client **G. Prabhakar Reddy** S/o. Late Ramulu Reddy, aged about 54 years, Occ: Business, R/o. H.No. 3-1-185, Mallapur, Medchal Malkajgiri District, on 11.03.2026 while my client had taken his Original Release Deed along with Link document and other papers for concerning his property to obtain photo copies at stationery named as Bhavani Stationery, Surya Nagar, Mallapur. After taking photocopies, my client returned to his residence, later he found that the Original Release Deed was missing. Immediately, my client rushed back to the said stationery shop and made through enquiries and searched, but the original Release Deed document Doct. No. 3119 of 2013, dated 26.07.2013 could not traced and inspite of his best efforts, and it is lost beyond my client recovery.
If any person or persons find the said original Registered Release Deed Doct. No. 3119 of 2013, dated 26.07.2013, the same may handover to the undersigned as a law abiding citizen. Further the above said original document shall not be abused or misused otherwise utilized by unauthorized person. If any unauthorized person makes misuse of it, the same shall not be bind on my client.
Hence this public notice.

**Sd/- B. PRAKASH**
**Advocate**
H.No.1-121/83, VST Colony, Nacharam, Hyderabad.
**Mobile No. 9490469238**

### IN THE COURT OF THE HON'BLE V ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT :: L.B.NAGAR
### O.S.No. 175 OF 2026

Between:
**Ponaganti Ranga Reddy and others ...PLAINTIFFS**
AND
**All Concerned and another ...DEFENDANTS**

To,
**ALL CONCERNED ....DEFENDANT No.1**

**NOTICE**

It is hereby informed the General Public that the Plaintiff's filed the above suit to declare them as the legal heirs of Late P. Bharathamma, who died intestate on 03-06-2023, and the same is posted on **06-04-2026.** If any person is having any objections they may appear before the court either in person or through an advocate or else the Hon'ble court may pass appropriate orders.

\\ By the order of the court //

**K. SRINIVAS REDDY**
**ADVOCATE**
Resident: Pot No. 25, H.No.4-12-522, Street No.5, High Court Colony, Vanasthalipuram, Hyderabad. **Cell No. 9440891830.**

### IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-VIII METROPOLITAN MAGISTRATE OF FIRST CLASS, AT MEDCHAL
### I.A.No. of 2026 IN O.S.No. 118 of 2026

Between:-
**Sri Mulpuri Siva Krishna & Others ...Petitioners / Plaintiffs**
And
**The Tahsildar**
Bachupally Mandal & Another
**...Respondents / Defendants**

**NOTICE**

To
**All concerned**

Please take notice that the Plaintiffs in the suit in O.S.No.118 of 2026 of Hon'ble I Addl. Junior Civil Judge-Cum-VIII Metropolitan Magistrate of First Class, At Medchal, have filed suit for declaration to declare the Plaintiffs as legal heirs of deceased, **SMT. MULPURI DURGA RANI** against the Respondents / Defendants herein and the above suit is posted to **06-04-2026 at 10.30 A.M.** for your appearance and answer.
Therefore, you are hereby requested to appear in the above said suit proceedings either in person or through an advocate on 06-04-2026 at 10.30 A.M., before the above Hon'ble Court otherwise the matter will be decided in your absence as per law.

//BY ORDER OF HON'BLE COURT//

**B .Vijaya Gopal Rao**
LLM: PG Dip in ADR (NALSAR)
**Advocate**
2-111, DUNDIGAL, Hyderabad-500043

## మాజీ హోంమంత్రి మహమూద్ అలీకి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన కేటీఆర్


కేటీఆర్ కు పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేస్తున్న మాజీ మంత్రి మహమూద్ అలీ, గ్రేటర్ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అజంఅలీ తదితరులు

మలక్ పేట ,మార్చి 21, ప్రభాతవార్త: రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని అజంపురాలోని మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ హోంమంత్రి మాహముద్ ఆలీ నివాసానికి బీఆర్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచ్చేసి మహమ్మద్ అలీ, అజంఅలీ తదితరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ, అజంఅలీ లు కేటీఆర్ కు పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి పండుగ శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా మలక్ పేట నియోజకవర్గం బిఆర్ ఎస్ ఇంచార్జి తీగల అజిత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునావర్ ఖాన్, మాజీ చైర్మన్లు సిహెచ్ రాధా, అనిత నాయక్, మాజీ వైస్ చైర్మన్లు భూమేష్, సాయ భువనేశ్వరి, మాజీ ఎస్ జి ఎస్ దామోదర్,మాజీ డైరెక్టర్లు తటవర్తి శ్రీనివాస్, నులీ శ్రీధర్ రావు, వంజరి ప్రవీణ్ కుమార్, నరేష్, డివిజన్ అధ్యక్షులు చల్లూరి రఘునందన్ రెడ్డి, హయ్యత్ హుస్సేన్ హబిబ్, మారుతి, పగిళ్ల శ్రీనివాస్ రెడ్డి, కామేష్, నాయకులు లలిత, తేళ్ల మహేష్ కుమార్, శ్రీధర్ రెడ్డి , గౌర శశిధర్ తదితరులు కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడికి అండగా కాంగ్రెస్ నాయకులు**



నేరెడ్ మెట్, మార్చి 21, ప్రభాతవార్త: మల్కాజిగిరి నియోజకవర్గంలోని ఈస్ట్ ఆనంద్ బాగ్ బండ చెరువులో నివాసం ఉంటున్న ఆర్యన్ గౌస్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు అండగా నిలిచారు. దయా హృదయంతో మైనంపల్లి హనుమంతన్న, మైనంపల్లి రోహిత్ బాబు సహకారంతో బాలుడి ఆపరేషన్ కోసం మూడు లక్షల రూపాయల ఎల్ఓసి మంజూరు చేయడం జరిగిందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మీడియా కన్వీనర్ గుండా నిరంజన్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బి బ్లాక్ ప్రెసిడెంట్ వెంకటేష్ యాదవ్, మల్కాజిగిరి వర్కింగ్ ప్రెసిడెంట్ బి.కె. శీను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మీడియా కన్వీనర్ నిరంజన్, సీనియర్ నాయకుడు కపిల్, గౌతమ్ నగర్ డివిజన్ అధ్యక్షుడు వైనాల ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు బాలరాజు యాదవ్, ధరన్, కుట్టి శీనన్న, జాన్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి: ఎమ్మెల్యే బలాల


ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా ప్రముఖ వ్యాపారవేత్త సోహెల్ మీర్జా తదితరులు

మలక్ పేట, మార్చ్ 21,ప్రభాతవార్త: పండుగలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని అక్బర్ బాగ్ ఉజాలేష ఈద్గా లో మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రజలతో కలిసి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు అనంతరం ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే బలాల రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ప్రముఖ వ్యాపారవేత్త సోహెల్ మీర్జా, నాయకులు అబ్రార్ తదితరులు ఎమ్మెల్యే బలాల కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక గా నిలుస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**రేణుకా ఎల్లమ్మ గుడి గోపురానికి బంగారు కలశం బహుకరణ**


గంగం ప్రేమ్‌నాథ్‌ను సన్మానిస్తున్న ఆఫీసర్స్ కాలనీ ప్రతినిధులు

వనస్థలిపురం. మార్చి. 21.ప్రభాతవార్త. సాహెబ్ నగర్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ గోపురానికి శ్రీ రామ నవమి పండుగ సందర్భంగా బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ బి.జె.పి .ప్రధాన కార్యదర్శి గంగం ప్రేమ్ నాథ్ బంగారు కలశ తాపడాన్ని బహుకరించారు.ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు ప్రొఫెసర్ బాలాజీ,వెంకట్ బెజవాడ తదితరులు గంగం ప్రేమ్ నాథ్ ను ఆయన కార్యాలయంలో కలిసి శ్రీ రామనవమి పండుగకు ఆలయానికి రావాలని కరపత్రాన్ని అందజేశారు.అదేవిధంగా ఆలయ గోపురానికి బంగారు కలశ తాపడాన్ని బహుకరించినందులకు ప్రేమ్ నాథ్ ను శాలువాతో సన్మానించారు.ఆలయ అభివృద్ధి కి సహాయ సహకారాలు అందిస్తున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్ నాయుడు,రఘు,సిదేశ్వర్,గంగం శ్రీ రామ్ తదితరులు పాల్గొన్నారు.


రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేయడానికి మాజీ మంత్రి మహమూద్ అలీ నివాసించడానికి విచ్చేసిన కేటీఆర్ ను శాలువాతో సన్మానిస్తున్న మాజీ డైరెక్టర్ వంజరి ప్రవీణ్ కుమార్, చిత్రంలో నాయకులు ఆజాం ఆలీ, తీగల అజిత్ రెడ్డి, భూమేష్ తదితరులు(మలక్ పేట, ప్రభాతవార్త)


రంజాన్ పండుగ సందర్భంగా చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. (సైదాబాద్,

# ధర్మనిలయం.. అంతా ప్రత్యేకం

**మరమరాలతో పందిరి..తొమ్మిది రోజుల పాటు పూజలు**

**27న శ్రీ సీతారాముల కళ్యాణం**

సైదాబాద్, మార్చి 21 ప్రభాతవార్త: ఆస్మాన్‌ఘడ్ ఏపిఏయు కాలనీ లోని ధర్మ నిలయం శ్రీ సీతారాముల కళ్యాణోత్స వానికి ముస్తాబయింది. నగరంలో మరెక్కడా లేని విధంగా ఇక్కడా అంతా ప్రత్యేకం అన్న రీతిలో మరమరాలు, వేరు శనగలతో దండలు, చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో సుందరంగా అలంకరిస్తారు. ధర్మ నిలయంలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని చూసి తీరాల్సిందే. ఏపిఏయు కాలనీలో సూర్యనారాయణ రాజు సతీమణి అనసూయమ్మ తమ ఇంటిలోనే ధర్మ నిలయం పేరిట రామాలయాన్ని ఏర్పాటు చేసి గత 42 సంవత్సరాలుగా మరమరాలతో పందిరి వేసి భద్రాద్రి రాముడి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.

**మరమరాల పందిరి....**

వాల్మీకి మహర్షిగా మారకముందు రామ అనే పదం సరిగ్గా పలకడం తెలియక మరా..మరా..అని జపిస్తూ తపస్సు చేశారని, అదే రామ నామముగా మారి ఆ దివ్య ప్రభావంతో ఆయనకు దివ్య దృష్టి కలిగి రామాయణము రచించగలి గారని పురాణాలు పేర్కొంటున్నాయి. రామ జపానికి మూ లం మర అనే భావనతో సీతారాము కళ్యాణానికి మర మరాల పందిరిని ధర్మనిలయంలో ఏర్పాటు చేస్తున్నారు. పదకొండు మరమరాల చొప్పున తయారు చేసే దండలో ఒక వేరుశనగ గింజను చేరుస్తారు. సీతా దేవి భూమి నుండి అవతరించిందనే పౌరాణిక గాధను అనుసరించి భూమి నుండి వచ్చే వేరుశనగకు మరమరాల దండలో ప్రాధాన్యం కల్పిస్తున్నారు. దశేంద్రియాల తర్వాత ఏకాదశ ఇంద్రియానికి ప్రత్యేక స్థానం కల్పించే ఉద్దేశ్యంతో పదకొండు సంఖ్యను ఎంచుకుని, 60 కేజిల మరమరాలు, 50 కేజిల వేరుశనగల తో తయారు చేసిన దండలతో పందిరిని శోభాయమానంగా అలంకరించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన రామామణ ముఖ్య ఘట్టాలను వివరించే బొమ్మల కొలువు అందరిని విశేషంగా ఆకట్టుకుంటుంది.


మరమరాలతో ఏర్పాటు చేసిన పందిరంలో రామయణంలోని ముఖ్య ఘట్టాలను వివరించే బొమ్మల కొలువు

**27న రాముల వారి కళ్యాణం.....**

ధర్మనిలయంలో ఉగాది నుండి శ్రీరామ నవమి వరకు తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. ప్రతి రోజు ఉదయం నగర సంకీర్తన, శ్రీరామ పూజ, ఏక రుద్రము, శ్రీ వినాయక, శ్రీ సీతారామ చంద్రస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి హోమము, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము నిర్వహిస్తున్నారు.

**శ్రీరాముడిపై అచంచల విశ్వాసంతోనే.....**

శ్రీరాముడిపై ఉన్న భక్తితోనే తన 8వ ఏట నుండే శ్రీరాముడి భక్తురాలిగా సేవ చేస్తున్నానని అనసూయమ్మ తెలిపారు. గత 42 సంవత్సరాలుగా మరమరాల పందిరి లోనే శ్రీ సీతారాముల కళ్యాణాన్ని జరిపిస్తున్నామని అన్నా రు. దాదాపు నలభై మంది భక్తులు మరమరాల దండల అ ల్లికలో పాల్గొంటారని ఆమె తెలిపారు. తన ఇద్దరు కుమారులు, కోడళ్ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్నామని అనసూయమ్మ తెలిపారు.

## ఎపిఎయు కాలనీలో ఘనంగా కొనసాగుతున్నా శ్రీరామనవమి మహోత్సవాలు : నిర్వాహకులు రమేష్ రాజ్

మలక్ పేట, మార్చ్ 21, ప్రభాతవార్త: ఆస్మాన్ ఘడ్ డివిజన్ ఏపీఎయు కాలనీలోని ధర్మ నిల యంలో శ్రీరామ నవమి మహోత్సవాల్లో భాగంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను కన్నుల పండువగ నిర్వహిస్తున్నారు. గత 46 సంవత్సరాలుగా కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, భక్తులు భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి ఆల్ ఇండియా రేడియో హరికథకులు, టీవీ కళాకారులు పి. రమణ భాగవతార్ భక్తి గొప్పదా శక్తి గొప్పదా హరికథ కార్యక్రమం అందరిని ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం ఉత్సవ నిర్వాహకులు, స్వాధిష్ఠ సేవా సమితి ప్రతినిధులు ఆర్. రమేష్ రాజు, నవీన్ పటాలే మడిగె, విజయభాస్కర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డిలు మాట్లాడుతూ శ్రీరామనవమి మహోత్సవాలలో భాగంగా ఉగాది నుండీ శ్రీరామనవమి వరకు ఎపిఎయు కాలనీ ధర్మ నిలయములోని అమ్మ గారి నిలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా హరి కథ ఆధ్యాత్మిక కార్యక్రమం ఉత్సాహంగా జరిగిందని వివరించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతినిత్యము శ్రీరామ కోటి పఠనము, ఉదయం 5: 30 నుంచి 6:00 గంటల వరకు వరకు నగర సంకీర్తన, ఉదయం 7 గంటల నుంచి 7. 30 నిమిషాల వరకు శ్రీరామ పూజ, ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు ఏకరుద్రము, అదేవిధంగా ఉదయం 9.30 గంటల నుంచి 10. 30 గంటల వరకు శ్రీ వినాయక, శ్రీ సీతారా మచంద్ర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి హోమము, ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతము తదితర పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలి పారు. అదేవిధంగా 22వ తేదీ ఆదివారం సాయంత్రం శ్రీరా మ పాదుక పట్టాభిషేకం నాటకము, 23వ తేదీ సోమవారం సాయంత్రం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం, 24వ తేదీ మంగళవారం సాయంత్రం వీర అభిమన్యుడు బుర్రకథ, 25వ తేదీ సాయంత్రం భక్తి గానాలహరి కార్యక్రమం, 26వ తేదీ గురువారం సాయం త్రం ఎదురుకోలు, 27వ తేదీ శుక్రవారం శ్రీ సీతారామ కళ్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించనునట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్ర మాలను విజయవంతం చేయాలని వారు కోరారు.


రమణ భాగవతార్ ను సన్మానిస్తున్న మడిగెల విజయభాస్కర్ రెడ్డి, రమేష్ రాజ్ తదితరులు

# ఉప్పల్‌లో ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు


రామంతాపూర్‌లో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎండి.జహంగీర్ తదితరులు


ఉప్పల్‌లో జరిగిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 21 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ తదితర ప్రాంతాల్లో రంజాన్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పలు ప్రాంతాల్లోని మసీదులలో రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వేడుకలు జరుపుకున్నారు. ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో ముస్లిం మైనార్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పలువురు పార్టీ నేతలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నేతలు పాల్గొన్నారు. ఉప్పల్‌లో యూత్ కాంగ్రెస్ నేత షేక్ మదార్‌వలీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, బజారు మురళీగౌడ్, తెల్కల మోహన్‌రెడ్డి, బూర్గుల రమేష్‌గౌడ్, సుధాకర్‌శెట్టి, చర్ల సుధాకర్‌రెడ్డి, బోరంపేట జయకృష్ణ, దర్శనం వినోద్, ఆలుగడ్డ శ్రీనివాస్‌యాదవ్, గణేష్‌నాయక్, లక్ష్మి, తదితరులు పాల్గొని చీరలు పంపిణీ చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలు ప్రాంతాల్లో పర్యటించి ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కుల,మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఆనందోత్సవాలతో పండుగ జరుపుకోవాలని సూచించారు. రామంతాపూర్ ఇందిరానగర్ ఈద్గా మసీదు, కుతుబ్ షాహి మసీదులో రంజాన్ పర్వదినం సందర్భంగా కాంగ్రెస్ ఇంచార్జి ఎం.పరమేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు. చిలుకానగర్‌లో డివిజన్‌లో బిఆర్ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. హబ్సిగూడ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి, డా.బి.వి.చారి, సోమిరెడ్డి తదితరులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

## యువత ఐఏఎస్, ఐపీఎస్ లక్ష్యంగా ముందుకు సాగాలి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం, మార్చి 21 ప్రభాతవార్త : యువత ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత సివిల్ సర్వీసులను లక్ష్యంగా పెట్టుకుని కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సివిల్ సర్వీసుల ద్వారా దేశానికి సేవ చేయడంతో పాటు సమాజంలో గౌరవం, ఉన్నత హోదా లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీతో కలిసి మార్చి 22 (ఆదివారం) సివిల్ సర్వీసులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారాసా నాయకులు సాయిజెన్ శేఖర్, సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఆర్.ఎస్. రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సదస్సులో పాల్గొని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ, గతంలో బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా గ్రూప్స్, పోలీస్ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్ అందించి అనేక మందికి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా సహకరించామని తెలిపారు. అలాగే నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఐదేళ్లపాటు ఉచితంగా ఫీజులు చెల్లిస్తూ వైద్యులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఇప్పుడు సివిల్ సర్వీసుల దిశగా కూడా ముందడుగు వేయడం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి విద్యా రంగానికి చేస్తున్న సేవలకు నిదర్శనమని కొనియాడారు.సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఆర్.ఎస్. రెడ్డి మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సు ఉప్పల్‌లోని సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీలో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించబడుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 8639882839 నంబర్‌కు సందేశం పంపించి ముందస్తు నమోదు చేసుకోవాలని సూచించారు.



సివిల్ సర్వీసెస్‌పై రూపొందించిన సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

## సంస్కృతి,సంప్రదాయానికి ప్రతీక రంజాన్ : కాంగ్రెస్

ఉప్పల్, మార్చి 21 ప్రభాతవార్త : రంజాన్ పండుగ వేడుకలు సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకలుగా నిలుస్తుందని మాజీ మున్సి పల్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నేత మేకల శివారెడ్డి, దుబ్బ నరసిం హారెడ్డి, బజారు మురళీగౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రంజాన్ పండుగ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నేత షేక్ మదర్‌వలీ మున్నా ఆధ్వర్యంలో పేదలకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, బజారు మురళీగౌడ్, తెల్కల మోహన్‌రెడ్డి, బూర్గుల రమేష్‌గౌడ్, సుధాకర్‌శెట్టి, చర్ల సుధాకర్‌రెడ్డి, బోరంపేట జయ కృష్ణ, దర్శనం వినోద్, ఆలుగడ్డ శ్రీనివాస్‌యాదవ్, గణేష్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మత సామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని, నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ తగు సహకారం అందిస్తుం దన్నారు. రంజాన్ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవడం హర్షనీయమన్నారు. స్వర్గీయ షేక్ బుడేసాహెబ్ ఆశయసాధనకు ఆయన కుమారుడు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రంజాన్ పండుగను ప్రతి ఒక్కరు ఆనందోత్సవాల మధ్య జరుపుకోవడం అభినందనీయమన్నారు. యూత్ కాంగ్రెస్ నేత షేక్ మదర్‌వలీ మాట్లాడుతూ నిరుపేదల ఆదుకునేందుకు ప్రతి ఏటా పేదలకు చీరలు, ఇతర వస్తువులు అందజేస్తున్నట్లు తెలిపారు. తన తండ్రి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. పేదల కోసం తన వంతు సేవ చేయాలనే లక్ష్యంతో పేదలకు చీరలు, పంచెలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మందికి చీరలు, జాకెట్లు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేతలు నాగరాజు, దుర్గ, హరి, కాంగ్రెస్ పార్టీ నేతలు రామకృష్ణ, మురళి, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, షేక్‌మదర్‌వలీ తదితరులు

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో భక్త ప్రహ్లాద నాటక ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు దృశ్యం.

ఉప్పల్, మార్చి 21 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో సురభి డ్రామా ఫెస్టివల్‌లో భాగంగా శనివారం శ్రీ సురభి జయానంద్ బృందం శ్రీ భక్త ప్రహ్లాద నాటకం ప్రదర్శించారు. హిరణ్యకశిపుని తపస్సు, ప్రహ్లాద జననం, ఆశ్రమంలో పెరగటం, రాక్షస బాలురతో విద్య నేర్చుకోవటం, ఎల్లపుడు హరి నామ స్మరణ చేయటం, హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడికి శిక్షలు వేయడం, శ్రీ మహావిష్ణువు మరియు లక్ష్మి దేవి స్వయంగా విచ్చేసి కాపాడడం, స్తంభం పెకిలించి నర్సింహా స్వామి రావడం, హిరణ్యకశిపుడిని సంహరించడం,ప్రహ్లాదుడిని ఆశీర్వదించడం ఘట్టాలను సురభి నాటకం కళాకారులు ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలు ఆహుతులతో ఎంతో ఆకట్టుకున్నాయి. బిందు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది.

## వెంకటసాయినగర్ కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి


వెంకటసాయినగర్ కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ నేతలు

రామంతాపూర్, మార్చి 21 ప్రభాతవార్త : రామంతాపూర్ బాగాయత్ వెంకట సాయి నగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంఘం నేతలు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాలనీ సంఘం అధ్యక్షుడు ఎ.విజయేందర్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నేత ఎం.డి జాహంగీర్, కాలనీ సభ్యులు ఆర్ గోవింద్, శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ, శివ, నరసింహ,చలపతిరావు, అశోక్, నరసింహ, విద్యాసాగర్, రమేష్ శెట్టి తదితరులు మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మహిళలు, చిన్నారులు, వృద్ధులు చీకటిలో అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు వస్తున్నారని, నేరాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వంతో చర్చించి వీధిదీపాలు వేయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ సంఘం నేతలు పాల్గొన్నారు.

## విజయరంగకు పవిత్ర గంగనది పుష్కర పురస్కారం


విజయ రంగను సన్మానిస్తున్న మహిళలు

ఎల్.బి.నగర్, మార్చి 21 ప్రభాతవార్త: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా సామాజికవేత్త డాక్టర్ బి.విజయరంగకు పవిత్ర గంగనది పుష్కర పురస్కారం లభించింది.జీవనది ఫౌండేషన్ ఆధ్వర్యంలో, భారతదేశంలోని 12 పవిత్ర నదుల పేర్లతో సమాజంలో నదుల శుభ్రతపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా సామాజిక సేవలో విశేషంగా సేవలందిస్తున్న స్వచ్ఛభారత్ జిల్లా కార్యదర్శి డాక్టర్ బి.విజయరంగకు పవిత్ర గంగనది పుష్కర పురస్కారంతో పాటు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ పురస్కారాన్ని ప్రముఖ దూరదర్శన్ న్యూస్ రీడర్ విజయదుర్గ, ఇంటిలక్ష్మిదుర్గ చేతులమీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నదులు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన జీవనాధారాలని, నేడు కాలుష్యం వల్ల తాగునీరు, వ్యవసాయం ప్రమాదంలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు నదుల సంరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. నదులను సంరక్షించాలని, జీవకోటిని కాపాడండలని, రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న భాస్కర్ రెడ్డి

ఎల్.బి.నగర్, మార్చి 21 ప్రభాతవార్త: క్రమశిక్షణ, దానగుణం, భక్తికి నిదర్శనం రంజాన్ పండుగ అని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. రామకృష్ణాపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ మసీదులో రంజాన్ పండుగ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో భాస్కర్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగా–జమున తహజీబ్ సంస్కృతికి ప్రతీకగా అందరం కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలన్నారు. పండుగ వేళ పేదలకు అండగా నిలవడంలో ముస్లిం సోదరుల సేవా దృక్పథం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ఎండి.జహంగీర్, బండి మధు, రాజు నాయక్, దుబ్బాక శేఖర్, యాదవరెడ్డి అక్బర్, ఆలేటి కిరణ్, పాషా, మహమ్మద్, షఫి, నబీ, పటేల్, వినయ్ పాల్గొన్నారు.

## మీర్‌పేట్ డివిజన్ పాష్‌కాలనీలో ఘనంగా రంజాన్


ముస్లింలకు రంజన్ శుభాకాంక్షలు తెలిపిన అనిల్ యాదవ్, గోపి యాదవ్, రాజ్‌కుమార్ తదితరులు

సరూర్‌నగర్, మార్చి 21 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి మీర్‌పేట్ డివిజన్‌లోని పాష్ కాలనీలో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక ముస్లింలు పాష్ కాలనీ మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ మేరకు హాజరైన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్ ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు పండుగ శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్, అబ్బనమోని గోపియాదవ్, మేకల యాదగిరి, భీమరాజు బిక్షపతి, బక్కతట్ల కృష్ణయాదవ్‌ణ, దోలా రమేష్, ముస్లిం పెద్దలు మహ్మద్ అలీ, మోహినణ్, పాషా పాల్గొన్నారు.

## 23 నుండి నాదర్‌గుల్ భక్తాంజనేయ దేవస్థానం దశమ వార్షికోత్సవాలు

సరూర్‌నగర్, మార్చి 21 ప్రభాతవార్త: నాదర్‌గుల్‌లోని శ్రీ విష్వక్సేన (గణపతి) సహిత శ్రీ సీతారామ భక్తాంజనేయ స్వామి దేవస్థానం దశమ వార్షికోత్సవాలు ఈ నెల 23వ తేదీ సోమవారం నుండి ప్రారంభమవుతున్నట్లు ఆలయ చైర్మన్ ఏనుగు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సహకారంతో ఈ ఉత్సవాలు ఈ నెల 28వ తేదీ శనివారం వరకు జరుగుతాయని ఆయన వెల్లడించారు. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో సోమవారం నుండి శనివారం వరకు బ్రహ్మోత్సవ పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆయన వివరించారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం హనుమత్ వాహన సేవ, బుధవారం సాయంత్రం గరుడ సేవ, గురువారం స్వామి వారి ఎదుర్కోళ్ళ ఉత్సవం, 27వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు భక్త జనుల సమక్షంలో శ్రీ సీతారామచంద్ర స్వామి తిరుకళ్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, అదే రోజు సాయంత్రం పుష్పక విమాన రథోత్సవం జరుగుతాయని ఆయన తెలిపారు. శనివారం మహా పూర్ణాహుతి, శతఘటాభిషేకం నిర్వహించిన అనంతరం పండిత సత్కారంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై దశమ బ్రహోత్సవాలను విజయవంతం చేయాలని ప్రభాకర్‌రెడ్డి ఆలయ కమిటీ తరపున కోరారు.



ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా డివిజన్లలో హోటళ్ళ వంట గదుల పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహిస్తున్న బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సరస్వతి



రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్‌లు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. (సైదాబాద్, ప్రభాతవార్త)